క్లుప్తంగా

ప్రతిభా పరీక్షకు స్పందన



ప్రతిభ పరీక్ష ప్రశ్నా పత్రాన్ని విడుదల చేస్తున్న విద్యా కమిటీ చైర్మన్ గణపతిరావు, ఉపాధ్యాయులు

వజ్రపుకొత్తూరు :విద్యార్థుల్లో పోటీతత్వం పెంచేందుకు వజ్రపుకొత్తూరు మండలం కొత్తపేట ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన మండల స్థాయి ప్రతిభా పరీక్షకు విశేష స్పందన లభించింది. విద్యా కమిటీ చైర్మన్ గీత గణపతిరావు ఆధ్వర్యంలో ప్రశ్నా పత్రాన్ని విడుదల చేసి నిర్వహించిన ఈ పరీక్షలకు మూడు నుంచి ఎనిమిది తరగతి విద్యార్థులు 142 మంది హాజరయ్యారు. ఇందులో ప్రతిభ కనబరిచి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రిపబ్లిక్ డే రోజున బహుమతులు ప్రదానం చేస్తారు. గణిత ఉపాధ్యాయులు చింత ఉమారావు పాల్గొన్నారు.

మత్తుకు బానిస కావద్దు

ఇచ్ఛాపురం రూరల్: ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేసుకునే వయసులో విద్యార్థులు మత్తుకు బానిసలు కావద్దని యువ న్యాయవాది, యువసూర్య చారిటిబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎం.రాంబాబు అన్నారు. ఇచ్ఛాపురం మండలం ఎం.తోటూరు ఆదిత్యా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాలు వలన కలిగే అనర్థాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈదుపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వెచ్చా సంతోష చెలమాజీ మాదక ద్రవ్యాల వినియోగంతో వాటిల్లనున్న నష్టాన్ని వివరించారు. విద్యా సంస్థల ప్రతినిధులు ఎస్వీ రమణ, రాజేంద్రప్రసాద శేఖర్, కామేష్, చిన్ని భైరీ, ధర్మరాజు పాల్గొన్నారు.

ఆర్థికంగా ఎదగాలి

ఇచ్ఛాపురం రూరల్: స్వయం సహాయక సంఘంలోని ప్రతి ఒక్క సభ్యురాలు ఆర్థికంగా ఎదగాలని, ఆ దిశగా వారిని బలోపేతం చేయాలని శ్రీనిధి మేనేజర్ కె.రాము అన్నారు. సోమవారం స్థానిక మండల సమాఖ్య భవనంలో గ్రామ సంఘ లీడర్లకు, వివోఏలకు విజన్ బిల్డింగ్ శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సంఘంలో నాయకత్వ లక్షణాలు, స్వయం శక్తి సంఘాలను సమర్థవంతంగా నడిపే విధానం, వ్యాపార మార్గాలు అన్వేషణ, కట్టుబాట్లు, క్రమశిక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏపీఎం సనపల ప్రసాదరావు, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిరీష

వజ్రపుకొత్తూరు: విద్యార్థుల జీవితంలో చదువుతోపాటు క్రీడలు అంతర్భాగం కావాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి గ్రిగ్స్ పోటీలను వజ్రపుకొత్తూరులోని పాఠశాలలో క్రీడా జ్యోతిని వెలిగించి అథ్లెటిక్స్, గేమ్స్ పోటీలను సోమవారం ప్రారంభించారు. హెచ్ఎం కె.హరిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కర్ని రమణ, మాజీ ఎంపీపీ జి.వసంతరావు, పీడీలు ఎస్. నాగరాజు, తవిటయ్య, జి.పాపారావు పాల్గొన్నారు.

చిరంజీవి నాగ్‌కు జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శ



చిరంజీవినాగ్‌ను పరామర్శిస్తున్న చైర్‌పర్సన్ విజయ

సోంపేట: మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం కుమారుడు చిరంజీవినాగ్ అనారోగ్యంతో శస్త్రచికిత్స చేయించుకొని ఇంటికి చేరారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ సోమవారం ఆమదాలవలసలోని ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. తమ్మినేని సీతారా దంపతులతో మాట్లాడారు. పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.

‘పది’లమైన ఫలితాల వైపుగా అడుగులు!

- మార్చి 17 నుంచి పదో తరగతి పరీక్షలు
- ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ప్రణాళిక
- ఉదయం, సాయంత్రం వేళల్లో స్టడీ అవర్స్



దొంకూరు ఉన్నత పాఠశాలలో స్టడీ అవర్ నిర్వహణ

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో టెన్త్ విద్యార్థుల వివరాలు

మండలం	విద్యార్థుల సంఖ్య
ఇచ్ఛాపురం	1501
కవిటి	970
కంచిలి	767
సోంపేట	1073

ఇచ్ఛాపురం రూరల్: ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలనే ఉద్దేశంతో సంబంధిత అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మార్చి 17 నుంచి 31వ తేదీ వరకు జరగనున్న పబ్లిక్ పరీక్షల్లో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకుంటున్నారు. ఉదయం ఎనిమిది నుంచి తొమ్మిది గంటల వరకు, సాయంత్రం నాలుగు నుంచి ఐదు గంటల వరకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. ప్రత్యేక తరగతులు, సెలవు దినాల్లో సైతం తరగతులు జరుగుతున్నాయి.

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి..

పబ్లిక్ పరీక్షలకు మూడు నెలలు సమయం మాత్రమే ఉండటంతో ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా ఉదయం ఒక సబ్జెక్టు, సాయంత్రం మరో సబ్జెక్టు చదివిస్తున్నారు. ఆ మరుసటి రోజు ముందు రోజు చదివిన సబ్జెక్టుకు సంబంధించి పరీక్ష నిర్వహించి వారి ప్రతిభను అంచనా వేస్తున్నారు. ఉపాధ్యాయులంతా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను బట్టీ వెనుకబడిన విద్యార్థులను దత్తత తీసుకుంటున్నారు. దత్తత తీసుకున్నవారు ఎలా చదువుతున్నారు, ఏ సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నారని గమనిస్తూ వారిలో భయాన్ని పాగొట్టి ఆత్మ విశ్వాసం నింపేలా కృషి చేస్తున్నారు.

సూచనలు, సలహాలు ఇస్తున్నారు



ఉదయం, సాయంత్రం సమయాల్లో మాకు రోజుకో ఉపాధ్యాయుడు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. అనుమానాలను నివృత్తి చేసుకునేందుకు ఈ స్టడీ అవర్స్ చక్కగా ఉపయోగపడుతుంది. 550 మార్కులు లక్ష్యంగా పెట్టుకున్నాను. ఉపాధ్యాయులు ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. దీంతో సబ్జెక్టుపై మాకు ఉన్న భయం పోతుంది.

– దున్న శ్రీజ, దొంకూరు జెడ్పీ హైస్కూల్

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



వంద రోజుల ప్రణాళికలో భాగంగా శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రతి ఉపాధ్యాయుడు శ్రమిస్తున్నారు. ఉత్తమ ఫలితాల సాధనకు ఉపాధ్యాయులం ప్రత్యేక ప్రణాళిక ప్రకారం రూపొందించడం జరిగింది. ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం

– సవిత కుమారీ దేవి, ఇంగ్లిష్ టీచర్, జెడ్పీ హైస్కూల్, ఈదుపురం

ఎప్పటికప్పుడు పర్యవేక్షణ



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంఈవోలు స్టడీ అవర్స్ నిర్వహణపై పర్యవేక్షణ చేయడం జరుగుతోంది. వంద రోజుల ప్రణాళిక పటిష్టంగా అమలు పరిచేందుకు ఉపాధ్యాయులు సైతం కృషి చేస్తున్నారు. సెలవు దినాల్లో ఉపాధ్యాయులు స్టడీ అవర్స్‌లో పాల్గొంటున్నారు. ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తూ సమిష్టి కృషితో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నాం.

– కురమాన అప్పారావు, ఎంఈవో, ఇచ్ఛాపురం

ప్రపంచ తెలుగు రచయితల సభలో సాహూసంధ్యకు సత్కారం



కవిటి: జ్ఞాపికను అందుకుంటున్న సాహూ సంధ్య



కాశీబుగ్గ: సత్కారం పొందుతున్న కృష్ణమూర్తి

కవిటి: మాణిక్యపురం గ్రామానికి చెందిన సాహూ సంధ్యకు ఆరవ ప్రపంచ తెలుగు రచయితల సభ ఘనంగా సత్కరించింది. విజయవాడ కేబీఎన్ కళాశాల ఆవరణలో ఈ నెల 28, 29 తేదీలలో జరిగిన మహాసభలో ‘రెండవ వేదికపై పర్యావరణం’ అనే అంశంపై కవిత పఠనం చేసిన ఆమెను శాలువ, సర్టిఫికెట్‌తో సత్కరించారు. మూడోవ వేదికపై సైతం కవిత గానం చేసినందుకు, నవల శిక్షణలో పాల్గొనందుకు ప్రత్యేక ప్రశంసాపత్రాన్ని అందించారు.

తెప్పలకు..

కాశీబుగ్గ: ప్రపంచ తెలుగు రచయితల సభలో పలాస జనజాగృతి సాహితీ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, లయన్ డాక్టర్ తెప్పల కృష్ణమూర్తికి ఘనమైన సత్కారం లభించింది. ‘తరతరాల తెలుగు యుగ యుగ యుగాల వెలుగు’ అను కవితా గానం చేసి కవులు, రచయితలు, సాహితీవేత్తల మన్ననలు పొందడంతో సభావేదికపై ఆయనను సత్కరించారు.

ఐఏఎల్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం:ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) క్యాలెండర్‌ను స్థానిక జూనియర్ సివిల్ జడ్జి పి.పరేష్‌కుమార్ ఆవిష్కరించారు. స్థానిక బార్ అసోసియేషన్ ఆవరణలో ఐఏఎల్ రాష్ట్రకార్యవర్గ సభ్యులు నాగరాజుపాత్రో ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు రవణయ్య, ఎన్.వి.ఎస్.రంగారావు, ఆర్.దేవరాజు, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు రాంబాబు, సీతయ్య, భగవాన్‌దాస్ పాల్గొన్నారు.

డీఏ స్టాలిన్‌కు బెస్ట్ యాక్టర్ ఫిల్మ్ ఫేర్ అవార్డు



అవార్డును అందుకున్న డి.ఎ.స్టాలిన్ మాస్టార్



అవార్డు అందుకున్న తాతయ్య మాస్టార్

టెక్కలి: టెక్కలికి చెందిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డీఏ స్టాలిన్‌కు ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బెస్ట్ యాక్టర్ ఫిలిమ్ ఫేర్ అవార్డు అందజేశారు. ఇటీవల విశాఖలో నిర్వహించిన విశాఖ ఇంటర్నేషనల్ ఫెస్టివల్–2024 కార్యక్రమంలో భాగంగా విప్లవ సేనాని వీరగున్నమ్మ చిత్రంలో నటనకు స్టాలిన్‌కు ఈ అవార్డు దక్కింది.

ఉత్తమ టెలీ షార్ట్ ఫిల్మ్‌గా ఆకలికాలం

విశాఖ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో భాగంగా టెక్కలికి చెందిన మూలతాతయ్య మాస్టార్ రచించి నిర్మాణం చేసి నటించిన ఆకలికాలం షార్ట్ ఫిల్మ్‌ను ఉత్తమ టెలీ షార్ట్ ఫిల్మ్‌గా ఎంపిక చేశారు. ఈ మేరకు తాతయ్య మాస్టార్‌కు అవార్డును అందజేశారు. ఇరువురికి ఉత్తమ అవార్డులు రావడంపై టెక్కలికి చెందిన ప్రజా చైతన్య కళా సమితి ప్రతినిధులు అభినందించారు.

రైతులను ఆదుకోవాలి

సోంపేట: ఇటీవల కురిసిన వర్షాలకు పంటలను నష్టపోయిన రైతులను ఆదుకోవాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సురాడ చంద్రమోహన్ కోరారు. ఈ మేరకు తహసీల్దార్ బి.అప్పలస్వామిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కూటమి నాయకులు జె.పురుషోత్తం, ఎం.బుద్దేశ్ ఉన్నారు.

పోలీసుల శ్రమదానం



గుంతలు పూడ్చుతున్న పోలీసు సిబ్బంది

సోంపేట: సోంపేట ప్రధాన రహదారిపై సామాజిక ఆస్పత్రి వద్ద గుంతలు ఏర్పడ్డాయి. సోంపేట సీఐ బి.మంగరాజు స్పందించి పోలీసు సిబ్బందితో కలిసి సోమవారం శ్రమదానంతో గుంతలను పూడ్చించారు.

అంచనా బడ్జెట్‌కు ఆమోదం



: బడ్జెట్ వివరాలు తెలియజేస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో శివాజీపాణిగ్రాహి

కవిటి: కవిటి మండల అంచనా బడ్జెట్‌ను సభ్యులు ఆమోదించారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి రూ.2,61,78,000 ప్రతిపాదనలతో కూడిన అంచనా బడ్జెట్‌కు సోమవారం మండలపరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆమోదం పొందిందని ఇన్‌చార్జి ఎంపీడీఓ శివాజీపాణిగ్రాహి తెలిపారు. ఎంపీపీ కడియాల పద్మ అధ్యక్షతన 2024–25 ఆర్థిక సంవత్సరం సవరణ బడ్జెట్, 2025–26 ఆర్థిక సంవత్సరానికి సిద్ధం చేసిన అంచనా బడ్జెట్‌ను జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహణాధికారి ఆమోదానికి గానూ మండలపరిషత్ సాధారణ సర్వసభ్యసమావేశం ఏకాభిప్రాయంతో ఆమోదాన్ని తెలిపింది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాల్ని సభలో ఇన్‌చార్జి ఎంపీడీవో శివాజీపాణిగ్రాహి సభలో వివరించారు. ఈ సవరణ,అంచనా బడ్జెట్‌లను శ్రీకాకుళం జడ్పీ కార్యాలయంలో తుది ఆమోదానికి నివేదించనున్నట్టు ఎంపీపీ కడియాల పద్మ,ప్రకాష్ తెలిపారు.

కార్మికులకు వేతనాల పెంపు

పలాస: కాశీబుగ్గ, మొగిలిపాడు, పలాస ఇండస్ట్రియల్ ఏరియా క్యాజు, రైస్‌మిల్లర్స్ యూనియన్‌కు, రైసు మిల్లు యాజమాన్యాలకు సోమవారం జరిగిన చర్చలు ఫలప్రదమయ్యాయి. కార్మికులకు గతంలో ఇచ్చిన వేతనాలు కంటే 15 శాతం పెంచడానికి ఇరు వర్గాలు అంగీకరించి ఆ మేరకు ఒప్పందం పత్రాలమీద సంతకాలు చేసుకున్నారు. అలాగే డ్రైవర్లకు గతంలో ఇచ్చిన జీతం కంటే రూ.1600 పెంచడానికి అంగీకారం కుదిరింది. చర్చల్లో లేబరు యూనియన్ అధ్యక్షులు అంబటి క్రిష్ణమూర్తి, బొంపెల్లి సింహాచలం, రైసుమిల్లు యూనియన్ నాయకులు జోకి రామారావు, కె.వి.గోపాల్, సిందిరి కిశోర్ పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలి



పలాస: అంబేద్కర్ విగ్రహం వద్ద వామపక్ష నేతలు

పలాస: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని వివిధ వామపక్షపార్టీల నాయకులు డిమాండ్ చేశారు. కాశీబుగ్గ అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, లిబరేషన్ తదితర పార్టీల నాయకులు చాపర వేణు, ఎస్.గణపతి, వంకల మాధవరావు, తామాడ సన్యాసిరావు, మద్దిల రామారావు, జుత్తు వీరాస్వామి, సార జగన్, ఎం.వినోద్ పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: అంబేడ్కర్‌ను అవమానపరిచిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా భారత ప్రజలకు క్షమాపణ చెప్పి తన పదవికి రాజీనామా చేయాలని దళిత, కార్మిక, ప్రజా సంఘాల నాయుకులు డిమాండ్ చేశారు. అమిత్ షా వ్యాఖ్యాలను నిరసిస్తూ స్థానిక ఆదిఆంధ్రా వీధిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు కె.కామేశ్వరరావు, కె.ఎన్.పి.ఎస్.నాయకులు బి.ప్రభాకర్, సీఐటీయ నాయకులు ఎస్.షణ్ముఖరావు, యూటీఎఫ్ నాయకులు పి.ధర్మారావు, కొల్లి యల్లయ్య, బి.వాసు పాల్గొన్నారు.

అవయవదాత కుటుంబానికి పరామర్శ

కాశీబుగ్గ: రోడ్డు ప్రమాదంలో మందస మండల కేంద్రానికి చెందిన సచివాలయ విద్యుత్ ఉద్యోగి కొంకి జోగారావు గాయపడి.. బ్రెయిన్ డెడ్ కావడంతో మృతి చెందారు. దీంతో అతని కుటుంబసభ్యులు జోగారావు అవయవాలను దానం చేశారు. ఈ విషయం తెలుసుకున్న పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష మృతిని కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించారు. నాయకులు రట్టి లింగరాజు, లబ్బ రుద్రయ్య, ముడుముంచి నవీన్‌కుమార్ ఉన్నారు.

నేడు మున్సిపల్ సమావేశం

ఇచ్ఛాపురం: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్టు చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి సోమవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్న సమావేశంలో అభివృద్ధి పనులపై చర్చిస్తామని.. సభ్యులు విధిగా హాజరు కావాలని కోరారు.

ఆకట్టుకున్న సైన్స్ ప్రదర్శనలు



టెక్కలి పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్



పలాస: విజేతలతో ఉపాధ్యాయులు



కవిటి: విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవోలు



కంచిలి: బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంఈవోలు

టెక్కలి: సౌత్ ఇండియా సైన్స్ ఫెస్టివల్‌లో భాగంగా సోమవారం వివిధ మండలాల్లో ఏర్పాటు చేసిన సైన్స్ ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. టెక్కలిలో జరిగిన ప్రదర్శనను ఎంఈవోలు డి.తులసీరెడ్డి, డి.చిన్నారావు ప్రారంభించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సైన్స్ ప్రతిభను ప్రాథమిక స్థాయి నుంచి పదును పెట్టాలన్నారు. ఈ సందర్భంగా వ్యక్తిగత, బృందాల వారీగా సుమారు 32 ప్రాజెక్టులతో విద్యార్థులు హాజరయ్యారు. బూరగాం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి దారపు హాసిని రూపకల్పన చేసిన సోలార్ పవర్ అండ్ ఇరిగేషన్ ప్రాజెక్టు వ్యక్తిగత విభాగంలో ప్రథమంగా, జెడ్పీ హెచ్ఎస్ సీతాపురం గ్రామానికి చెందిన విద్యార్థులు కర్రి రోషిత్, పప్పు నాగ చైతన్య రూపకల్పన చేసిన ఎయిర్ ప్యూరీఫియర్ ప్రాజెక్టు గ్రూప్ ఎగ్జిబిట్ విభాగంలో ప్రథమ స్థానంలో ఎంపికైంది. జెడ్పీహెచ్ లింగాలవలసకి చెందిన ఉపాధ్యాయుడు పూన సూర్యప్రకాశ్ నేతృత్వంలో రూపకల్పన చేసిన ఎర్త్ క్విక్ అలెర్ట్ ప్రాజెక్టు టీచర్ ఎగ్జిబిట్ విభాగంలో ప్రథమ స్థానంలో ఎంపికైంది. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.కిరణ్మయి, ఉపన్యాసకులు కె.శ్రీనివాసరావు, యు.సంధ్యారాణి, ఆర్.జనార్దన్, పాఠశాల హెచ్ఎం డి.నాగభూషణరావు పాల్గొన్నారు.

పలాస: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ ఘనంగా జరిగింది. ఎంఈవోలు సీహెచ్ శ్రీనివాస్, సీహెచ్ సత్యం పర్యవేక్షించారు. వ్యక్తిగత విభాగంలో 17, సమూహవిభాగంలో 14 ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఉపాధ్యాయుల నుంచి ఒక ప్రాజెక్టు ప్రదర్శించారు. ప్రధానోపాధ్యాయులు డి.దాశరథి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నరిసింహమూర్తి వీటిని తిలకించి విద్యార్థులను అభినందించారు. న్యాయ నిర్ణేతులుగా సైన్సు అధ్యాపకులు హనుమంతు బుజ్జి , యుగంధర్ వ్యవహరించారు. తొమ్మిదో తరగతి విద్యార్థి జశ్వంత్‌పాత్రో రీజనరేటివ్ బ్రేకింగ్ ప్రాజెక్టు, పదో తరగతి విద్యార్థి టి.భరత్‌కుమార్ గ్రీన్‌బాక్సు, ఎల్.నీలాచలం మంకీ గన్ ప్రాజెక్టులు జిల్లా స్థాయికి ఎంపికయ్యాయి.

కవిటి: కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ఎంఈవోలు ధనంజయమజ్జి, కె.చిట్టిబాబులు పర్యవేక్షించారు. గ్రూప్ విభాగంలో 16, విద్యార్థులు వ్యక్తిగతంగా 15, టీచర్ విభాగంలో ఐదు ప్రాజెక్టులను ప్రదర్శించారు. మండలస్థాయి విజేతలుగా విద్యార్థి వ్యక్తిగతం విభాగంలో రాజపురం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల నుంచి డిల్లీశ్వరి, గ్రూప్ విభాగంలో ముత్యాలపేట పాఠశాల విద్యార్థులు మురహరి, సిద్దార్థ్, టీచర్స్ విభాగంలో కొత్త కొజ్జిరియా ఉన్నతపాఠశాల గణిత ఉపాధ్యాయురాలు త్రివేణి మొదటి బహుమతులు సాధించారు. వీరు త్వరలో జిల్లాస్థాయిలో జరగబోవు వైజ్ఞానిక ప్రదర్శనకు వెళ్లనున్నట్లు ఎంఈఓలు ధనుంజయమజ్జి కె.చిట్టిబాబు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు బెందాళం మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

కంచిలి: కంచిలి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌ను ఎంఈవోలు ఎస్.శివరాంప్రసాద్, కె.చిట్టిబాబు ప్రారంభించారు. 80 ప్రాజెక్టులను ప్రదర్శించారు. సమూహ విభాగంలో మఠం సరియాపల్లి ఏపీ మోడల్ స్కూల్ మొదటి స్థానం, కంచిలి జెడ్పీ ఉన్నత పాఠశాల రెండో స్థానం, బూరగాం జెడ్పీ ఉన్నత పాఠశాల మూడో స్థానంలో నిలిచాయి. వ్యక్తిగత విభాగంలో వరుస మూడు స్థానాల్లో రుద్రప్రకాష్ మహంతి (ముండ్ల జెడ్పీ హెచ్ఎస్), కె.కీర్తిక(కె.జి.బి.వి.జాడుపూడి), బి.రితిక (ఏపీ మోడల్ స్కూల్ ఎం.ఎస్.పల్లి) బహుమతులు దక్కించుకొన్నారు. ఉపాధ్యాయుల విభాగంలో ఏపీ మోడల్ స్కూల్, మఠం సరియాపల్లికి చెందిన భాగ్యలక్ష్మి బహుమతి దక్కించుకొన్నారు. అత్యధిక ప్రాజెక్టులతో పాల్గొన్న డి.జి.పురం జెడ్పీహెచ్ఎస్, కంచిలి ఏపీఎస్‌డబ్ల్యూఆర్ నిలిచాయి. పాఠశాల హెచ్ఎం సీతారాంనాయుడు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: పట్టణంలోని ప్రభుత్వన్నత పాఠశాలల ఆవరణలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనను ఎంఈవో కురమాన అప్పారావు ప్రారంభించారు. విద్యార్థుల వ్యక్తిగత విభాగంలో 22, గ్రూప్ విభాగం నుంచి 27 ప్రాజెక్టులను ప్రదర్శించారు. విద్యార్థి వ్యక్తిగత విభాగం నుంచి పి.దీప్‌కుమార్ట్, గ్రూప్ విభాగం నుంచి కొళిగాం జెడ్పీహెచ్ఎస్ట్, ఉపాధ్యాయ విభాగంలో ఆటో మేటిక్ జిబ్రాక్రాసింగ్ సిస్టం ప్రాజెక్టులు బహుమతులకు ఎంపికయ్యాయి. ఎంఈవో–2 విశ్వనాథం, బాలురు కళాశాల ప్రిన్సిపాల్ జె.సాదయ్య, హెచ్ఎం ఎస్.విశ్వనాథం పాల్గొన్నారు.

టెక్కలి: కోటబొమ్మాళి జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనను ఎంఈవో ఎల్.వి.ప్రతాప్, నోడల్ ఉపాధ్యాయుడు డి.గోవిందరావు పర్యవేక్షించారు. లఖిందిడ్డి పాఠశాల విద్యార్థి బమ్మిడి రామ్‌చరణ్ రూపకల్పన చేసిన స్మార్ట్ ట్రైన్, జర్జంగి ఉన్నత పాఠశాల విద్యార్థులు డి.జస్వంత్, ఎస్.రజని రూపకల్పన చేసిన ట్రాఫిక్ కంట్రోలర్ విత్ రియల్ టైమ్ క్లాక్ ప్రాజెక్టు మొదటి, రెండవ స్థానంలో నిలిచాయి.



ఇచ్ఛాపురం: ప్రాజెలను పరిశీలిస్తున్న ఎంఈవోలు అప్పారావు, విశ్వనాథం



కోటబొమ్మాళి ఉన్నత పాఠశాలలో సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శన

మద్యం, సారా స్వాధీనం

కంచిలి: మండలంలోని మూడు చోట్ల పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లు, నాటుసారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వాటిని అమ్ముతున్న వారిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. జె.నారాయణపురం గ్రామానికి చెందిన మొగిలిపురి తార వద్ద నుంచి 19 మద్యం క్వార్టర్ బాటిళ్లను, జలంత్రకోట పంచాయతీ పరిధి మాణిక్యపురం గ్రామానికి చెందిన భైరడి ఎల్లమ్మ నుంచి 80 సారా ప్యాకెట్లు, నువాగడ కాలనీకి చెందిన జలధర గౌమాంగో నుంచి ఎనిమిది లీటర్ల సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని వారిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ. పి.పారినాయుడు తెలిపారు.